# మధుర భావన – 4

బెల్ మోగిన చప్పుడుకు లేచి వెళ్ళి సుమజ తలుపు తీసి వంశీని చూసి ''రండి'' అంది లోపలకు ఆహ్వానిస్తూ.

వంశీ లోపలకు వచ్చి అక్కడ హాలులో ఉన్న సోఫాలో కూర్చుంటూ అన్నాడు ''నేను వస్తానని అనుకున్నట్లుగా చాలా మామూలుగా చూసారూ...?'' అన్నాడు.

''అంటే... ఆశ్చర్యపోలేదనా... మీ ఉద్దేశ్యం?'' అంది అతనివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

''అవును... అదే! 'మీరేమిటీ, ఇక్కడ... ఎలా...?' అంటూ కొంచెం విస్తుపోతారేమో నని నేను ఊహించాలెండి...!'' అన్నాడు వంశీ మనసులోని అభిప్రాయాన్ని చెప్పేస్తూ. సుమజ చిన్నగా నవ్వింది. ''అయితే, మీకు ఆశాభంగం కలిగించానా? అయితే... మీరు మళ్ళీ బయటకు వెళ్ళండి. నేను తలుపులు మూసేస్తా. మీరు బెల్ మోగించగానే, బయటకు వచ్చి ఆశ్చర్యాన్ని నటిస్తూ... మీరన్నట్లే 'మీరు... ఇక్కడ... ఎలా...' అంటాను! సరేనా...?''

అతను మెల్లగా నిట్టూర్చి ''నటన అనేది వద్దు లెండి. అది నాకు అంత ఆనందం కలిగించదు !'' అన్నాడు. తర్వాత ఒక క్షణం ఆగి మళ్ళీ అన్నాడు... ''అవును... మీనా చెప్పారు కనుక నేను వస్తాననే విషయం మీకు ముందే తెలిసివుంటుంది కదా!''

''అవును...'' అంటూ తలవూపింది సుమజ. ''మీనా నడిగి అడ్రసు తెలుసుకున్నారు కనుక వెంటనే వచ్చేస్తారేమోనని ఎదురుచూ...స్తూన్నా! కానీ... మీరే... కొంచెం ఆలశ్యం చేశారు...!'' నిష్ఠూరంగానూ చూసింది.

ఆ మాటలతో వంశీ మోహం విప్పారింది.

''నిజమా... ఎదురు చూసారా...?'' ఆనందంగా అడిగాడు. మళ్ళీ వెంటనే నిట్టూర్చి మెల్లని స్వరంతో ''ఇది... ఇది... నటనేమో కదూ....?'' అన్నాడు.

సుమజ చురుగ్గా చూసింది. ''ఇది నటనని ఎందుకనుకుంటున్నారూ...? నిజమే చెప్పాను!'' అంటూ కొంచెంగా తలవంచుకుని అతనిని ఓరగా చూసింది.

''నిజమా...?! అయితే... ఇద్దరిలోనూ ఒకే విధమైన స్పందన ఉందన్న మాట!'' ఆనందోత్సాహంతో అంటూ ఆలశ్యానికి కారణం వివరించాడు.

* * *

సరిగ్గా అపుడే లోపలనుండి అక్కడకు వచ్చిన సుమజ తల్లి భార్గవి వంశీని చూసి ఎవరన్నట్లుగా కూతురివైపు చూసింది. అతను ఆమెను చూసి అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు.

సుమజ వివరించింది. ''అమ్మా... నీకపుడు చెప్పాగా... దామోదరం మామయ్యగారింటి ఫంక్షన్ లో పరిచయం అయ్యారని చెప్పానే... వంశీ కృష్ణ... అని.... అతనే ఈయన. కొందరు మోహన్ అనీ పిలుస్తూంటారు. ఊరునుండి ఇపుడే వచ్చారు...!" అంటూ సుమజ తల్లికి పరిచయం చేసింది.

''ముందుగా తెలియదు కదా... నాకీ పేళ మా ఫ్రెండు ఇంట్లో పూజా కార్యక్రమం ఉంది. వాళ్ళకి వస్తానని చెప్పేసాను...'' అంది ఇబ్బందిగా చూస్తూ.

''ఏం ఫర్వాలేదమ్మా... నువ్వెళ్ళిరా... మర్యాదల సంగతి నేచూసుకుంటాలే!'' భరోసాగా అంది తల్లితో సుమజ.

''అవునండీ... మీరెళ్ళి రండి... సుమజతో మాట్లాడి నేనూ బయలుదేరతాను!'' ఆమెతో వంశీ అన్నాడు.

ఆవిడ 'అయితే సరే' అన్నట్లుగా తల వూపి బయటకు వెళ్ళింది ఇద్దరి వైపు చూసి.

''కూర్చోండి ఇక...!'' అంది సుమజ వంశీతో. తరువాత ''ఇపుడు చెప్పండి... మీకేం కావాలీ? ఏం తింటారూ...?'' అనడిగింది.

''బావుంది... నేనేవి అడిగితే... అవి ఎలా వచ్చేస్తాయీ... గారెలు లాంటివి అడిగాననుకోండి... ఎలా వీలవుతుందీ... ముందుగా పప్పు నానబోయటం లాంటివి ఉంటాయిగా...?''

సుమజ చిన్నగా నవ్వింది ''జొమోటో.... స్విగ్గీ లాంటివి ఉండగా అలాంటివన్నీ ఎందుకూ... కోరుకున్నావి వెంటనే వచ్చేస్తాయిగా...!''

''ఆ మాటే మర్చిపోయాన్నేను! ఇదంతా మా అమ్మ తప్పులెండి. ఎపుడైనా బయటకు వెళ్తే తప్ప... ఏం అడిగినా... 'కాసేపటిలో ఇంట్లోనే తయారుచేసుకోవచ్చులే'... అంటూ అవి చేయటానికి తయారైపోతూంటుంది...! ఇపుడు... నాదీ అదే మాట! కాకపోతే... ఏదైనా తేలికపాటిది... అంటే... సులభంగా త్వరగా తయారయ్యేది ఇద్దరం కలిసి చేసేద్దాం... ఏమంటారూ...?'' అని సుమజ వైపు చిరునవ్వుతో చూస్తూ మళ్ళీ అన్నాడు ''ఈ మధ్య ఎక్కడో చదివానో, విన్నానో... ఈ కాలం వాళ్ళకి కొందరికి మాత్రమే అనుకోండీ, ఇంట్లో వంటసేది ఉండక... వంటగది గురించీ, అది ఇంట్లోనే ఉంటుందనే విషయమూ తెలియనే తెలియదట! మరి మీకూ...'' అంటూ ప్రశ్నార్థకంగా చూసాడు.

సుమజ సరదాగా నవ్వేసింది.

''నాకు మా ఇంట్లోని వంటగదీ తెలుసు... దేనికి ఏం కావాలో, ఎక్కడున్నాయో లాంటివి అన్నీ తెలుసులెండి. సులభంగా అయ్యేది అంటే ఉప్మాయేగా... ఎంత.... చేసేస్తా...!"

సుమజ వెనకే వంశీ కూడా వెళ్ళాడు.

''నేనూ చేయగలను! మా అమ్మకు సాయం చేసే అనుభవం ఉంది లెండి!'' అన్నాడు వంశీ. ఆ మాటలకు సుమజ మళ్ళీ నవ్వింది.

''ఎందుకు.... ఎందుకూ మీకు నవ్వొచ్చిందీ...?'' ఆరా తీసాడు వంశీ.

''ఏదో... జ్ఞాపకం వచ్చీ...'' అంటూ నసిగింది.

''అదే... ఏమిటని... తెలుసుకోవాలనిపిస్తోంది. చెప్పండీ...!'' అంటూ వంశీ రెట్టించాడు.

''ఏం లేదూ... ఈ రోజుల్లో పెళ్ళి చూపుల్లో అమ్మాయిలే అబ్బాయిని 'వంట వచ్చా...?' అని అడగటం రివాజయిందట! మరి... అమ్మాయిలు కూడా అబ్బాయిలతో సమంగా ఉద్యోగాలు చేస్తున్నారుగా, మరి... మగవాళ్ళకీ అన్ని పనులూ వచ్చివుంటే, ఇద్దరూ కలిసి చేసుకుంటారనే ఉద్దేశ్యంతో అయివుంటుంది! అలాంటి పరిస్థితి వస్తే... మీరు చక్కగా వచ్చని చెప్పి మంచి మార్కులు సంపాదించేస్తారుగా అనిపించింది!'' అంది సుమజ నవ్వు మొహంతో.

వంశీ ఆలోచనగా చూస్తూ ''అలా ఎవరూ అడగలేదే... బహుశా వాళ్ళు ఉద్యోగస్థులు కాకపోవటం వలనో... లేక వాళ్ళకి వంట లాంటి పనులు చేసే ఉద్దేశ్యం లేనివాళ్ళు అవటంవలనో...!'' అన్నాడు.

''అయితే... మీకూ పెళ్ళిచూపులు అనుభవాలు ఉన్నాయన్నమాట!'' కళ్ళు పెద్దవిచేసి చూస్తూ అంది సుమజ. "వాటి గురించి సరదాగా చెప్పండి...'' అంటూ బలవంత పెట్టింది.

వంశీ కూడా నవ్వుతూ ''సరే.... చెబుతాలెండి...!'' అంటూ మొదలు పెట్టాడు.

''ఆ మధ్య ఒకాయన ఎవరో ఒక సంబంధం చెప్పారు. మా అమ్మ 'పెళ్ళి అమ్మాయిని చూసిరా...' అంటూ పోరు పెట్టింది. అమ్మాయి తండ్రి వాళ్ళమ్మాయిని తీసుకుని ఏదో క్లబ్ పేరు చెప్పి... నన్నూ అక్కడికి రమ్మని పిలిచారు... అక్కడ కూర్చుని తాపీగా మాట్లాడుకోవచ్చని. నేనూ సరేనని వెళ్ళా.

ముగ్గురం కూర్చుని ఏవో మాట్లాడుకుంటున్నాం. ఆ అమ్మాయి నన్ను నేను చదివిన సబ్జెక్ట్స్ గురించీ, మార్కులు గురించీ వివరాలడిగేసరికి ఆ ప్రశ్నలకు నాక్కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది. అది గమనించి కాబోయి అమ్మాయి తండ్రి కొంచెం గొప్పగా చూస్తూ చెప్పాడు 'మా అమ్మడుకు కొంచెం తెలివితేటలు ఎక్కువే అందుకనేమో ఆ విషయంలో అందరిగురించీ వివరం తెలుసుకోవాలనుకుంటుంది!'' అన్నారు.

నేనేదో సమాధానం చెప్పబోయేంతలోనే ఆ అమ్మాయి ఉన్నట్టుండి వాళ్ళ నాన్నతో అంది ''అవున్నాన్నా... పొద్దున్న మనింటికి వచ్చిన అంకుల్ నీతో 'బడ్జెట్ వస్తోందీ... వేటి ధరలు పెరుగుతాయో' అంటూ బాధపడుతూ మాట్లాడుతున్నాడు కదా, అసలు బడ్జెట్ వేయకుండా ఉంటే వేటి ధరలూ పెరగవుగా...?''

ఆ మాటలకు ఏం జవాబు చెప్పాలో తెలియనట్లుగా ఆయన బిత్తర చూపులు చూశాడు. నేను నవ్వును ఆపుకునే ప్రయత్నం చేసాను.

లేచి నిలబడి ఒక సలహా ఇచ్చాను. ''పెళ్ళి అంటే కూడా ఏవో సమస్యలు వస్తుంటాయి... సంఘర్షణలూ తప్పవు. అందుకని పెళ్ళి అనే బంధంతో మీ అమ్మాయిను ఇబ్బంది పెట్టకుండా చక్కగా, స్వేచ్ఛగా ఇలాగే ఉండనీయండీ!' అని. ఆ మాట చెప్పి అక్కడ క్షణం కూడా ఉండకుండా బయలుదేరి వచ్చేసాను!'' అంటూ సరదాగా నవ్వుతున్న సుమజతో పాటుగా వంశీ తనూ నవ్వాడు.

''ఇంకొక అనుభవం కూడా ఉంది. అది కూడా చెప్పేస్తాను'' అన్నాడు వంశీ.

''చెప్పండి....'' అంటూ ఆసక్తిగా చూసింది సుమజ.

‘‘నేను అపుడే పెళ్ళి వద్దంటున్నా అమ్మ వినటం లేదుగా... నాన్న పోయాక మరీ ఒంటరిగా ఉంటున్నానంటూ కోడలు రావాల్సిందే అని పట్టుబడుతోంది! అమ్మకి పెళ్ళి చూపులకంటూ వచ్చే ఉద్దేశ్యం లేదు కాబట్టి... అందుకు తగ్గట్టుగా ఏర్పాటూ చేస్తోంది.

అమ్మ చిన్నప్పటి స్నేహితురాలట... ఆవిడ వాళ్ళమ్మాయిని పెళ్ళి చూపులనే అభిప్రాయంతోనే వెంట బెట్టుకుని మా ఇంటికి వచ్చింది. ఆ అమ్మాయి చాలా కలివిడిగా, అందంగా ఉందనే అభిప్రాయం అమ్మకి ఏర్పడిందని నేనూహించాను.

అయితే కాసేపటికి ఓ గమ్మత్తు జరిగింది. ఆ అమ్మాయి చటుక్కున ‘మీ ఇల్లంతా తిరిగి చూస్తానండీ...’ అంటూ గిరగిర అంతా తిరిగింది. చూసి వచ్చి అమ్మకి సలహాలు ఇచ్చింది. ఏదో రెండు మూడు గోడలు తీసెయ్యాలనీ... అపుడు ఇల్లు విశాలంగా అనిపిస్తుందనీ చెప్పి, ఇంకో రెండు చోట్ల షెల్ఫ్ లు ఏర్పాటు చేస్తే ఇంటికి మంచి లుక్కు వస్తుందనీ వివరించింది! తనకి ఇంటీరియర్ డిజైనింగ్ అంటే ఇష్టమని చెప్పింది. అంతవరకూ బాగానే ఉంది గానీ చివరకో మాట అంది. ‘అపుడప్పుడూ అయినా వచ్చిపోతూంటాంగా, అత్తవారిల్లూ అందంగా అనిపించాలికదా... అందుకనే  ఈ మార్పులు చెప్పానూ...!’ అని.

అమ్మ అర్థం కానట్లుగా చూసి ‘‘అపుడపుడూ అని అన్నావేంటమ్మా?’’ అని ఆ అమ్మాయినే అడిగింది.

‘‘అవునండీ... మీ అబ్బాయికి ఇక్కడే ఉద్యోగం వచ్చినా, వ్యాపారం చేసినా సరే, అమ్మా వాళ్ళింటికి అపుడపుడూ వెళ్ళినట్లే... ఇక్కడికీ మేం అలాగే వచ్చి వెళ్తూంటాం కదా...?’’ అంది.

‘‘అంటే... మీరిద్దరూ వేరే ఇంట్లో ఉంటారంటావా...?’’ అని అమ్మ అడిగింది!

‘‘అంతేగా మరి... నా కసలు ఎక్కువ మంది మనుష్యులు ఉండటం నచ్చదండీ! చుట్టాలైనా సరే... అలా కనిపించి, వెంటనే వెళ్ళిపోవటమే బావుంటుంది! ఆఖరుకు ఆడబడుచులైనా సరే.... పిల్లా పీచుతో వచ్చి ఉంటామంటే... నాకసలు నచ్చదు! మీరొక్కరూ ఉంటే... మీ అమ్మాయి... మీ ఇష్టం! ఎన్నాళ్ళయినా ఉండొచ్చుననుకోండీ!’’

అలా నిర్మొహమాటంగా తన అభిప్రాయం చెప్పేసింది ఆ అమ్మాయి. మా అమ్మ కూడా నసగకుండా తన అభిప్రాయమూ చెప్పేసింది. "మావాడికి మాత్రం.... బంధుమిత్రులు ఇంటికి వచ్చి పోతూండాలని ఇష్టం! అసలు నన్నొదిలి వేరేగా ఉండటానికీ ఇష్టపడడు.... నాకూ అలాంటి అభిప్రాయం లేదు!" అని నిక్కచ్చిగా చెప్పేసరికి వాళ్ళిద్దరూ మొహాలు ముడుచుకుని వెళ్ళిపోయారు!

వాళ్ళు వెళ్ళిపోయాక మా అమ్మ ఒకటే సణుక్కుంది. 'ఆవిడ... సంపాదించిన ఆస్తి చూసి... నేను ఏ కండిషను పెట్టినా ఒప్పేసుకుంటాననుకున్నట్లుంది! తన కూతురి అందచందాల గురించి వర్ణించి... ఎంత మంది వెంటబడుతున్నారో వివరించి... ఇంకోసారి ఆలోచించుకోమనీ హెచ్చరించింది' అంటూ తన స్నేహితురాలి మాటల గురించి తలుచుకుని తలుచుకుని చిరాకుపడింది.

నాకేమో సరదాగా అనిపించింది! అమ్మకి ఇంకొంచెం చిరాకు తెప్పించాలని నేను అన్నాను ''ఆ అమ్మాయి చెప్పింది నిజమేగా... చాలా అందంగా ఉందికూడా. ఈ సంబంధం నాకు మాత్రం బాగా నచ్చింది....! చేసేసుకుందామా... వాళ్ళకి బోలెడంత డబ్బు ఉందంటున్నావు, కాబట్టి హాయిగా కాలు మీద కాలు వేసుకుని కాలక్షేపం చేసేయొచ్చు...!'' అని.

అమ్మ చిరచిరలాడుతూ ''అయితే ఇంకేం... చేసుకుంటానని వాళ్ళకి చెప్పు... నా ప్రమేయం వాళ్ళకీ అక్కర్లేదు... నీకూ అనవసరం! మధ్యలో నాకెందుకూ చెప్పటం... నా ఇష్టం, నా ప్రమేయం ఏమీ అవసరంలేదుగా!'' అంది కోపంగా చూస్తూ.

నా మాటలు నిజం కావని అమ్మకీ తెలుసు. కాకపోతే నేను తనని ఉడికించటానికి అంటున్నానని, తనూ అలా కోపంగా సమాధానం చెప్పిందన్నమాట!

''ఇవండీ... నా రెండు పెళ్ళిచూపుల ప్రహసనాలూ....'' అంటూ సుమజవైపు నవ్వుతూ చూసాడు వంశీ. సుమజా ''బావున్నాయి!'' అంటూ నవ్వింది.

''మరి... మీవీ....?'' ప్రశ్నార్థకంగా చూసాడు వంశీ

''ఇంకా... మొదలు కాలేదు....!'' అంది సుమజ నవ్వు మొహంతో.

''మీ కలాంటి అవసరాలనేవి రావని నా అభిప్రాయం!'' అన్నాడు వంశీ ఆమెవైపు ఇష్టంగా చూసి.

సుమజ నిట్టూర్చి వూరుకుంది.

సంభాషణను మరో దారికి మళ్ళించటానికన్నట్లుగా వంశీ తింటూన్న ఉప్మాప్లేటు వైపు దృష్టిని పెట్టి ''ఈ రోజు ఉప్మా చాలా రుచిగా అనిపించింది. కొత్తగా ఏమీ మనం వేయలేదు కదా...?'' అన్నాడు.

సుమజ నవ్వింది చిన్నగా. ''కారణం ఏమిటో... నాకు తోచింది చెప్పనా....?''

ఏమిటన్నట్లుగా చూశాడు వంశీ. ''సరదా కబుర్లను కలిపి చేశాం కదా, అదే కారణం అయివుంటుంది...!''

సుమజ మాటలకు వంశీ తలవూపుతూ ''సరిగ్గా చెప్పారు. అవును... అదే అయివుంటుంది!'' అన్నాడు చిరునవ్వుతో.

తినటం పూర్తయ్యాక... ''మరి మీ అమ్మగారు బయటకు వెళ్ళారు... మధ్యాహ్నం వంట... మనం ఏమైనా చేద్దామా...?'' అంటూ వంశీ నసుగుతూంటే సుమజ ''భలే... మీరు... అన్ని విషయాల గురించీ బాగా ఆలోచిస్తున్నారే... మా అమ్మలా...'' అంటూ నవ్వి చెప్పింది.

''ఈశ్వరమ్మ అనే ఒకావిడ ఉంది.... అన్ని పనుల్లో అమ్మకి సాయం చేయటానికి ఈ రోజు ఉదయమే వచ్చి మా టిఫిన్లన్నీ అయ్యేవరకూ ఉండి ఇంటికెళ్ళింది. మా అమ్మ కూడా కాసేపట్లో వచ్చేస్తుంది...ఆమె కూడా అప్పటికి వచ్చేస్తుంది. ఇల్లు ఇక్కడికి బాగా దగ్గరే..!"

''బాగా పొద్దున్నే బయలుదేరాసేమో... బాగా ఆకలిగా అనిపించింది... మీరు చక్కటి టిఫిను చేసిపెట్టారు. ఇపుడు బయలుదేరితే మధ్యాహ్న భోజనానికి మా ఊరుకు, ఇంటికీ చేరిపోతా...!'' అన్నాడు వంశీ.

''సరే...'' అన్నట్లు తల వూపిన సుమజ ''అసలు పని మర్చిపోయినట్లున్నారు... కృష్ణ విగ్రహం తీసుకెళ్ళాలిగా...'' అంది లోపలనుండి తీసుకురావటానికి సిద్ధపడుతూ.

''ఇపుడు వద్దండీ.... చెప్పానుగా, కేవలం అది ఒక్కటే కాదు నాకు కావలసిందని!''

''మరి...?'' సుమజ ఆశ్చర్యంగా చూస్తూ అంది'' అవును... ఈ మాట ఇంతకుముందూ అన్నారు... వివరం చెప్పండి...!''

‘‘అపుడు చెప్పిన సమాధానమే ఇపుడూ చెబుతున్నా… ఇంకొంత కాలం ఆగాలని. నేను అనుకున్నది పూర్తిగా నిర్ధారణ అయ్యాక చెబుతానదేమిటో…!’’

‘‘సరే… మీ ఇష్టం…’’ అంటూ వూరుకుంది సుమజ.

* * *